సాక్షి నిజామాబాద్

బుధవారం । 20 । మార్చి । 2024



భీమ్‌గల్ బస్ డిపోను..
భీమ్‌గల్ బస్ డిపోను అభివృద్ధి చేయాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు డీసీసీ అధ్యక్షుడు మానాల వినతిపత్రం ఇచ్చారు.
- 8లో ▸



గరిష్ఠం/కనిష్ఠం
35.4 /23.4

వాతావరణం
ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు న్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మరో రెండు రోజులు జిల్లాకు వర్షసూచన !

సుభాష్‌నగర్: జిల్లాలో బుధ, గురువారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముంది. జిల్లాకు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం రాత్రి సిరికొండ, ధర్పల్లి మండలాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. కాగా వరుసగా కురుస్తున్న వర్షాలతో రైతాంగం ఆందోళన చెందుతోంది. పసుపు, వరి, ఉల్లి, సజ్జ, ఇతరాత్ర పంటలు చేతికొచ్చాయి. రోడ్లపై ఆరబెడుతున్నారు. నువ్వు పంట మరో 15 రోజుల్లో చేతికొస్తుంది. ఈసమయంలో వడగళ్లు, ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలు కురుస్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ఎన్నికల్లో అక్రమాల అడ్డుకట్టకు 'సీ-విజిల్'



ఖలీల్‌వాడి: ఎన్నికల్లో అక్రమాల, నిబంధనల ఉల్లంఘనకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం 'సీ-విజిల్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. రాజకీయ పార్టీలు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే సాక్ష్యాలతో సహా అందులో పొందుపరచవచ్చు. ఉల్లంఘనలకు సంబంధించిన ఫొటో, వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డ్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో యాప్‌లో ఫిర్యాదు చేసిన 5 నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై ఎన్నికలకు సంబంధించిన అధికారులు విచారణ చేపట్టిన 100 నిమిషాల్లో ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారు.

రెండో రోజు 60 మంది గైర్హాజరు

నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం రెండో రోజు హిందీ పరీక్ష జరిగింది. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా 141 సెంటర్లలో విద్యార్థులు పరీక్షలు రాశారు. 21,896 మంది విద్యార్థులకు గాను 21,836 మంది విద్యార్థులు హాజరు కాగా.. 60 మంది విద్యార్థులు గైరాజరయ్యారు. డీఈవో 10 పరీక్ష కేంద్రాలను, జిల్లా అబ్జర్వర్ ఒక సెంటర్‌ను, సిట్టింగ్ స్క్వాడ్ 47 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

కాంగ్రెస్ గూటికి ఇద్దరు కౌన్సిలర్లు



ఆర్మూర్: నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పొద్దు టూరి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లిన ఇద్దరు కౌన్సిలర్లు, తాజామాజీ సర్పంచులు బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆర్మూర్ మున్సిపల్ కౌన్సిలర్లు సుంకరి రమేశ్, తాటి హనుమాండ్లుతోపాటు మాజీ కౌన్సిలర్ వన్నెల్‌దాస్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు పండిత్ పవన్, సంజయ్‌సింగ్, బీఆర్‌ఎస్ నాయకులు బోండ్ల సంతోష్, కొట్టాల మోహన్, కొంగి సదాశివ్, మధ్యప్రదేశ్ రాజు తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. వీరితోపాటు తాజా మాజీ సర్పంచులు నీరడి రాజేశ్వర్(కోమన్‌పల్లి), సింగిరెడ్డి మోహన్(ఖానాపూర్), మగ్గిడి, సుర్బి ర్యాల్ గ్రామాల మాజీ సర్పంచుల భర్తలు నర్స య్య, గణేశ్ తదితరులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఈరవత్రి అనిల్, గోర్త రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచడానికి కృషిచేయాలి

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో సీనియర్ సిటిజన్స్ ఓటింగ్ శాతం పెంచడానికి కృషి చేయాలని స్వీప్ నోడల్ ఆఫీసర్ సురేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం నూతన కలెక్టరేట్ ఆవరణలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా అందరు నూరుశాతం పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో రసూల్ బీ, డీఆర్‌డీఏ కల్చరల్ గంగాధర్, సీనియర్ సిటిజన్స్ భూమన్న, రాంమోహన్‌రావు, గంగాధర్, సిద్దయ్య పాల్గొన్నారు.

డొంకేశ్వర్ మండలం కోమట్‌పల్లి వద్ద రైతులు ఆరబోసిన మక్కలు



మక్క రైతు మురిసె..



క్వింటాలుకు రూ. 3,450 ఒప్పందం



సీడ్ మక్క పండించి ఇస్తే క్వింటాలుకు రూ. 3,450 ఇస్తామని వ్యాపారి ఒప్పందం చేసుకున్నాడు. నేను మూడెకరాల్లో సీడ్ మొక్కజొన్న పంట వేశాను. ఎకరానికి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. కానీ, ఐదు కిలోల తరుగు తీస్తున్నారు. బైబ్యాక్ ఒప్పందం కావడంతో ఏమి అనలేని పరిస్థితి నెలకొంది. తరుగు తీయకుండా కొంటే బాగుంటుంది.
– మహ్మద్ హైదర్, రైతు, నికాల్‌పూర్

- లోకల్ పంటకు క్వింటాలుకు రూ. 2,100 పలుకుతున్న ధర
- ఎకరానికి రూ. లక్ష దాకా ఆదాయం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- కొన్ని ప్రాంతాల్లో దిగుబడి తగ్గిన సీడ్ మక్క

డొంకేశ్వర్(ఆర్మూర్): మొక్కజొన్న పంటకు మంచి రోజులొచ్చాయి. లోకల్ మక్కలు క్వింటాలుకు రూ. 2,100 దాకా అమ్ముడు పోతున్నాయి. రైతులకు ఎలాంటి శ్రమ లేకుండా వ్యాపారులే కల్లాల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. పంట దిగుబడి పెరగడంతో పాటు గిట్టుబాటు ధర రావడంతో మక్క రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి లక్షల రూపాయల వరకు ఆదాయాన్ని పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో రైతులు 23వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. గతేడాది మంచి ధర రావడంతో ఈ ఏడాది కూడా మక్కను సాగు చేయడానికి మరికొంత మంది రైతులు ముందుకొచ్చారు. దీంతో మొక్కజొన్న సాగు విస్తీర్ణం కొద్దిగా పెరిగింది. అయితే, సాగు చేసిన కొన్ని రోజులుకు కత్తెర పురుగులాంటి తెగుళ్ల పంటను ఆశించాయి. రైతులు మందులను పిచికారీ చేయడంతో తెగుళ్ల నశించాయి. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మొక్కజొన్న ఎదిగి మంచి దిగుబడులను ఇచ్చింది. ప్రస్తుతం జిల్లా అంతటా మొక్కజొన్న పంట చేతికిరాగా, ఇప్పటికే చాలా ప్రాంతాల్లో కోతలు పూర్తయి మక్కలు కల్లాలకు చేరుకున్నాయి. లోకల్ మొక్కజొన్న ఎకరానికి 40–45 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. కల్లాల వద్దకే వస్తున్న వ్యాపారులు మక్కలను లారీల్లో ఎక్కించి తీసుకెళ్తున్నారు. మేలురకానికి క్వింటాలు రూ. 2,300కు కొనుగోలు చేస్తుండగా, రెండో రకానికి రూ. 2వేల నుంచి రూ. 2,100 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఈసారి ఎక్కువ ఎకరాల్లో మక్కను సాగు చేసిన రైతులకు కాసుల వర్షం కురుస్తోందని చెప్పవచ్చు.

సీడ్ మక్కలో తగ్గిన దిగుబడి

జిల్లాలో చాలా మంది రైతులు కంపెనీ వ్యాపారులతో ముందస్తు ఒప్పందం చేసుకుని సీడ్ మొక్కజొన్నను సాగు చేశారు. అయితే, సీడ్ విత్తనాల్లో పలు రకాల కంపెనీలున్నాయి. ఎకరానికి 25–30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, క్వింటాలుకు రూ. 3,300 నుంచి రూ.3,500 వరకు కొనుగోలు చేస్తామని వ్యాపారులు రైతులతో ఒప్పందాలు చేసుకున్నారు. పలుచోట్ల చేతికి వచ్చిన పంటను యంత్రాలతో కోస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో మక్క కంకులనే సంచుల్లో నింపి తీసుకెళ్తున్నారు. క్వింటాలుకు ఐదు కిలోల తరుగు కూడా తీస్తున్నారు. విత్తనాలు, ఖర్చులు పోను రైతులకు క్వింటాలుకు రూ. 3వేలు వస్తోంది. అంటే ఎకరానికి సుమారుగా రూ. 80వేల దాకా రైతులకు ఆదాయం వస్తోంది. సీడ్ మక్కలతో పోలిస్తే లోకల్ మక్కలకే ఎక్కువ లాభాలు కనిపిస్తున్నాయి. అయితే, సీడ్ మక్క వేసిన వారిలో కొంతమంది రైతులకు దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. విత్తన లోపం వలన 10–15 క్వింటాళ్లకు పరిమితమైంది. దిగుబడి తగ్గడంపై మధ్య వర్తులను, వ్యాపారులను రైతులు ప్రశ్నిస్తున్నారు. ఒప్పందం ప్రకారం రైతులకు న్యాయం చేస్తామని వ్యాపారులు చెబుతున్నారు.

పరిహారం కోసం..



అంతంపల్లి వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

భిక్కనూరు: వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులు ఆందోళన బాటపట్టారు. మంగళవారం అంతంపల్లి శివారులోని జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పంటల సాగుకు ఎకరానికి రూ. 50 వేల పెట్టుబడి పెట్టామన్నారు. వడగండ్ల వానతో తీవ్రంగా నష్టపోయామని పేర్కొన్నారు. అకాల వర్షాలతో ఏటా నష్టపోతున్నా ఏ ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల నష్టాన్ని చూసేందుకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ వచ్చారని, వారు నష్ట పరిహారంపై స్పష్టమైన హామీ ఇవ్వలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రెండు గంటలపాటు రాస్తారోకో చేయడంతో జాతీయ రహదారికి ఇరువైపులా సుమారు మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. బీటీఎస్ చౌరస్తా వరకు వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు బీటీఎస్ చౌరస్తా నుంచి దోమకొండ, సంగమేశ్వర్, కాచాపూర్, పెద్దమల్లారెడ్డిల మీదుగా వాహనాలను మళ్లించారు. కామారెడ్డి ఆర్డీవో రంగనాథరావు, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, తహసీల్దార్ శివప్రసాద్, భిక్కనూరు సీఐ సంపత్ కుమార్, ఎస్సై సాయికుమార్, వ్యవసాయ అధికారులు అపర్ణ, రాధ ధర్నా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. పంట నష్టపోయిన ప్రతి రైతు వద్దకు వచ్చి పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని, ప్రభుత్వం తగిన న్యాయం చేస్తుందని వారు భరోసా ఇవ్వడంతో రైతులు శాంతించారు. ఆందోళనలో భిక్కనూరు, లక్ష్మీదేవునిపల్లి, అంతంపల్లి, జంగంపల్లి, తిప్పాపూర్, దోమకొండ మండలంలోని గొట్టిముక్కుల, లింగుపల్లి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రంగనాథరావు



రైతుల రాస్తారోకోతో జాతీయ రహదారిపై భారీగా నిలిచిన వాహనాలు

చురుకుగా ఆధునికీకరణ పనులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా చేసే లక్ష్మి కాలువ ఆధునికీకరణ పనులు వేగంగా సాగుతున్నాయి. కాలువ ఆధునికీకరణ కోసం 2017లో ప్రభుత్వం రూ. 20కోట్ల నిధులను మంజూరు చేసింది. అప్పటి నుంచి పనులు నెమ్మదిగా కొనసాగుతూ వచ్చాయి. ముప్కాల్ మండలం నాగంపేట్ శివారులోని మైనర్ కాలువ వెంట యాసంగి సీజన్‌లో కాల్వల ద్వారా రైతులు పంటను సాగు చేయలేదు. పనులు పూర్తిచేయాలని క్రాప్ హాలీడే ప్రకటించారు. దీంతో ప్రస్తుతం పనులు వేగం పుంజు కున్నాయి. మైనర్ కాలువ గైడ్ వాల్స్ పనులు, యూటీ పనులు కొనసాగుతున్నాయి. అయితే పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికి నాణ్యతతో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నాగంపేట్ శివారులో కొనసాగుతున్న మైనర్ కాలువ పనులు

ఖరీఫ్ నాటికి పూర్తయ్యే అవకాశం

లక్ష్మి కాలువ ఆధునికీకరణ పనులను సీజన్‌లో సకాలంలో చేపడితేనే వచ్చే ఖరీఫ్ నాటికి పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో కాలువ ద్వారా ఏప్రిల్ 10 వరకు నీటి సరఫరా చేసే అవకాశం ఉంది. కాలువ ద్వారా నీటి విడుదల నిలిచిన వెంటనే పనులను ప్రారంభిస్తే సకాలంలో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. కాల్వల పనులు సీజనల్‌గా చేపట్టాల్సి ఉంటుంది. కాలువ ద్వారా నీటి విడుదల నిలిపివేసే సమయంలోనే సకాలంలో ప్రారంభించి వేగవంతం చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

కమ్మర్‌పల్లి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. కమ్మర్‌పల్లిలోని బ్రహ్మంగారి గుట్ట వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్టును మంగళవారం సీపీ కల్మేశ్వర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు అక్రమంగా తరలించకుండా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో సామాన్యులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు. జిల్లా సరిహద్దు కావడంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. సరిహద్దు దాటిన తర్వాత రహదారులు, గ్రామాల వివరాలు, సదుపాయాలు, తాగునీరు, నీడ, విధుల నిర్వహణ, సమయం, వీడియోగ్రాఫర్ తదితర అంశాలను ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి, భీమ్‌గల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజశేఖర్, తహసీల్దార్ ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



ఆర్మూర్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్

డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్‌రూం పరిశీలన

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్‌రూంలను, అలాగే డిస్ట్రిబ్యూషన్ ప్రాంతాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్‌లు పరిశీలించారు. కళాశాల విద్యార్థులకు సరిపడా గదులు ఉన్నాయా అని కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదైన పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎదుట గల ప్రభుత్వం పాఠశాల కేంద్రాన్ని పరిశీలించారు. వారి వెంట ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ గజానన్, ఏసీపీ బస్వారెడ్డి తదితరులున్నారు.

అభయహస్తంపై అయోమయం

- లబ్ధిదారులకు అందని పింఛన్లు
- జమ చేసిన నిధులు సైతం చెల్లించని వైనం
- ఇబ్బందుల్లో మహిళా సంఘాల సభ్యులు
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మహిళలకు అందాల్సిన బకాయిలు రూ. 12.67 కోట్ల పైమాటే..



మోర్తాడ్: మహిళా సంఘాల సభ్యుల కోసం గత ఉమ్మడి రాష్ట్రంలో ఆరంభించిన అభయహస్తం పథకం అయోమయంలో పడింది. ఈ పథకంలో చేరిన సంఘ సభ్యులకు 55 ఏళ్లు నిండిన తర్వాత ప్రతి నెలా రూ. 500 పింఛన్ అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. దీనిని గత ప్రభుత్వం నీరుగార్చింది. తెలంగాణ ఏర్పాటయ్యాక గత ప్రభుత్వం 2017 నుంచి ఈ పథకాన్ని నిలిపివేసింది. ఫలితంగా ఈ పథకం ద్వారా పింఛన్లు పొందుతున్న ఎంతో మంది లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అభయహస్తం పథకంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో 13,506 మంది లబ్ధిదారులుగా ఉన్నారు. వీరికి అప్పట్లో 55ఏళ్లు నిండడంతో ఒకేసారి రూ.3,685 సభ్యత్వ సొమ్ము కింద గత ఉమ్మడి ప్రభుత్వం జమ చేసింది. ఈ మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాలో జమ చేయగా లబ్ధిదారుల్లో ఒక్కొక్కరికి ప్రతి నెలా రూ.500 చొప్పున పింఛన్‌గా చెల్లించేది. ఈ పింఛన్‌ను గత ప్రభుత్వం 2017 నుంచి నిలిపివేసింది. అభయహస్తం పథకం కింద మరో 40వేల మంది సభ్యులుగా చేరారు. వీరు ఏడాదికి రూ.385 చొప్పున సభ్యత్వ సొమ్ముగా జమ చేశారు. ఇలా ఐదేళ్ల పాటు జమ చేయగా ఒక్కో సభ్యురాలు రూ.1,925 చెల్లించారు. మహిళలు తమ భవిష్యత్తు పింఛన్ కోసం సభ్యత్వం సొమ్ముగా రూ.7.70 కోట్లు ప్రభుత్వానికి జమ చేశారు. లబ్ధి పొందినవారు, కొత్త సభ్యులు కలిపి మొత్తం రూ. 12,67,69,610 నిధిని సమకూర్చారు. కానీ గత ప్రభుత్వం పథకం కింద పింఛన్ పొందిన వారికి ఆసరా పింఛన్‌ను వర్తింపజేయలేదు. అభయహస్తం పింఛన్‌ను నిలిపివేసినా ఆసరాను వర్తింపచేయడంలో చొరవ చూపలేకపోయింది. అటు అభయహస్తం పింఛన్ అందక ఇటు ఆసరా లబ్ధి పొందక సంఘ మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం మహిళలు చెల్లించిన సొమ్మును తిరిగి చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. ఈ సొమ్మును చెల్లించేందుకు గత ప్రభుత్వం 2023 మార్చిలో సభ్యుల ఖాతా నంబర్లు, ఇతర వివరాలను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగుల ద్వారా సేకరించింది. కానీ అమలుకు నోచుకోలేదు.

చెల్లించిన నిధులు ఇవ్వాలని..

ఉమ్మడి రాష్ట్రంలో అమలైన ఈ అభయహస్త పథకం తెలంగాణ ఆవిర్భావం అనంతరం గత ప్రభుత్వం నిలిపివేసింది. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఈ పథకంపై దృష్టి సారించి తాము జమ చేసిన అభయ హస్తం నిధులను ఇప్పించాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత అయినా ఈ అభయహస్తం సొమ్మును తిరిగి చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

జిల్లా ఆస్పత్రిలో ఇద్దరు శిశువుల మృతి

కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సోమవారం ఇద్దరు నవజాత శిశువులు మృతి చెందారు. పట్టణానికి చెందిన ఓ గర్భిణి ఉదయం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి పాలు తాగిన తర్వాత శిశువు అస్వస్థతకు గురికావడంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే శిశువు మృతిచెందిందని వైద్యులు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతో సకాలంలో వైద్యం అందక శిశువు మృతిచెందిందని బాధితులు ఆరోపించారు. అలాగే ఉదయం ఓ గర్భిణికి డెలివరీ చేశారు. శిశువు ఉమ్మనీరు మింగడంతో జన్మించిన కాసేపటికే మృతిచెందింది. శిశువుల మరణాల విషయంలో వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంసింగ్ తెలిపారు.

కార్పొరేషన్‌లు సరే..
గల్ఫ్ బోర్డు మాటేమిటి?

- కులసంఘాలకు 16 కార్పొరేషన్లను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం
- వలస కార్మికుల సంక్షేమానికి బోర్డు ఏర్పాటుపై దాటవేత
- ఎన్నికల హామీని నిలబెట్టుకోవడం లేదంటున్న కార్మికులు

మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన కార్మికుల సంక్షేమం కోసం ప్రవాసీ విధానంతో కూడిన గల్ఫ్ సంక్షేమ బోర్డును ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు అన్ని రకాల ప్రయోజనాలను కల్పించడానికి 16 కార్పొరేషన్లను ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు అంశాన్ని ఎందుకు విస్మరిస్తున్నారని వలస కార్మికులు ప్రశ్నిస్తున్నారు. బోర్డు ఏర్పాటుతో.. కార్మికుల కుటుంబాలకు కల్పించాల్సిన ప్రయోజనాలు.. సొంతూరుకు చేరుకున్న కార్మికులకు పునరావాసం, పునరేకీకరణ తదితర కార్యక్రమాలను చేపట్టే అవకాశం ఉంటుంది. ఇప్పటికే గల్ఫ్ దేశాల్లో వివిధ కారణాల వల్ల మరణించిన వారి కుటుంబాలకు రూ. 5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వం ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కానీ బోర్డును ఏర్పాటు చేస్తే అన్ని రకాల ప్రయోజనాలను వలస కార్మికులకు, వారి కుటుంబాలకు అందించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాధారణ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఇప్పట్లో గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు ప్రకటన చేసే అవకాశం లేదు. కనీసం ఎన్నికల తంతు ముగిసిన తరువాతనైనా బోర్డును ప్రకటించాలని వలస కార్మికులు కోరుతున్నారు.

" న్యాయం చేయాలి



వలస కార్మికుల గురించి తెలంగాణ ప్రభుత్వం ఆలోచన చేయాలి. లేకుంటే వలస కార్మికులకు న్యాయం జరుగదు. వలసల కార్మికులు విదేశాల్లో పని చేయడం వల్లనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి దండిగా విదేశీ మారకద్రవ్యం వచ్చిపడుతోంది.
– రమేశ్ పటేల్, బ్రహ్మాయిన్, భీమ్‌గల్ మండలం

బోర్డు ఏర్పాటయ్యే వరకు..



గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటయ్యే వరకు మా పోరాటం ఆగదు. కాంగ్రెస్ తమ మెనిఫెస్టోలో ఈ అంశం ప్రకటించింది. ప్రవాసీ విధానంతో కూడిన గల్ఫ్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామనే హామీని ప్రభుత్వం నిలబెట్టుకునే వరకు ఉద్యమిస్తాం. – గుగ్గిళ్ల రవిగౌడ్, గల్ఫ్ జేఏసీ కన్వీనర్

క్లుప్తంగా

26 నుంచి బీపెడ్‌ సెమిస్టర్స్‌

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీపెడ్‌ మొదటి, మూడో సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలు ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్‌ ఎం అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు 30వ తేదీన ముగుస్తాయని, పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ www.telanganauniversity.ac.inను సందర్శించాలని ఆమె సూచించారు.

సెలవు రోజుల్లోనూ బీఎస్‌ఎన్‌ఎల్‌ కేంద్రాల సేవలు

నిజామాబాద్‌ సిటీ: సెలవుల దినాల్లో కూడా బీఎస్‌ఎన్‌ఎల్‌ వినియోగదారుల సేవాకేంద్రాలు పని చేస్తాయని సంస్థ జనరల్‌ మేనేజర్‌ వీ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24(ఆదివారం), 29(గుడ్‌ ఫ్రైడే), 31(ఆదివారం) ఈ మూడు సెలవు దినాలలో కూడా బీఎస్‌ఎన్‌ఎల్‌ వినియోగదారులు తమ బిల్లులు చెల్లించడానికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆడపిల్లల రక్షణ అందరి బాధ్యత



బోధన్‌: ఆడపిల్లల రక్షణ అందరి బాధ్యత అని మహిళా సాధికారత జిల్లా మిషన్‌ సమన్వయకర్త పి స్వప్న అన్నారు. బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలోపై మహిళ, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికల సంక్షేమం, వారి చదువుల కోసమే ప్రభుత్వం బేటీ బచావో – బేటీ పడావో పథకాన్ని అమలు చేస్తోందన్నారు. లింగ వివక్ష, బాల్య వివాహాల నిర్మూలన తదితర అంశాలపై గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను చైతన్య పర్చే కార్యక్రమాలు చేపట్టాలని ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లకు సూచించారు. సీడీపీవో జానమ్మ, కళాశాల ప్రిన్సిపల్‌ డాక్టర్‌ ఎస్‌ ప్రసాద్‌, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ రాధిక రాథోడ్‌ పాల్గొన్నారు.

‘గురుకుల’ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (టీఎస్‌డబ్ల్యూఆర్‌) విద్యాలయాలు, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల (టీటీడబ్ల్యూఆర్‌ఈఐ) విద్యాలయాల్లో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ నిజామాబాద్‌ రీజినల్‌ కోఆర్డినేటర్‌ (ఆర్‌సీవో) కే.అలివేలు తెలిపారు. ప్రవేశాలకు సంబంధించిన వివరాలను మంగళవారం ఆమె వెల్లడించారు. 2024–25 సంవత్సరానికి 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేయనున్న నేపథ్యంలో, ప్రవేశ పరీక్ష బీఎల్‌వీసెట్‌–2024 అభ్యర్థులు www.tswreis.ac.in వెబ్‌సైట్‌ ద్వారా ఈ నెల 23వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పాఠశాలల వారీగా, తరగతులు, కులాల వారీగా ఖాళీలను సంస్థ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌ దరఖాస్తుకు సంబంధించి ఏవైనా సందేహాలుంటే ఆయా జిల్లాల్లోని సమీప సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ పాఠశాల, కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్‌ 21 న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎంపిక చేసిన పరీక్షాకేంద్రాల్లో నిర్వహించనున్నట్లు ఆర్‌సీవో తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌సీవో అలివేలు

రీజియన్‌ పరిధిలో ఖాళీగా ఉన్న సీట్లు

జిల్లా	తరగతి	బాలికలు	బాలురు
కామారెడ్డి	6	20	08
	7	11	09
	8	12	01
	9	20	06
నిజామాబాద్‌	6	03	05
	7	08	09
	8	06	10
	9	06	09
నిర్మల్‌	6	01	--
	7	01	--
	9	03	--

వికారాబాద్‌, ఖమ్మం జిల్లాల్లో 8వ తరగతి ప్రవేశాలు..

టీటీడబ్ల్యూఆర్‌ఈఐ వికారాబాద్‌ జిల్లా పరిగి (బాలికలు) సీవోఈ, ఖమ్మం (బాలురు) స్కూళ్లలో 8వ తరగతిలో రెగ్యులర్‌ సీట్లను భర్తీ చేయనున్నట్లు ఆర్‌సీవో వివరించారు. పరిగిలో 80 సీట్లు, ఖమ్మంలో 90 సీట్లు ఉన్నట్లు వివరించారు. అర్హతలకు సంబంధించిన పూర్తి వివరాలను www.tswreis.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు.

కరీంనగర్‌, రంగారెడ్డి జిల్లాల్లో 9వ తరగతి ప్రవేశాలు..

టీఎస్‌డబ్ల్యూఆర్‌ఐ సంస్థ కరీంనగర్‌ జిల్లా అలుగునూర్‌ పాఠశాల (కో ఎడ్యుకేషన్‌), రంగారెడ్డి జిల్లా గౌలిదొడ్డి(బాలికలు) పాఠశాలల్లో తొమ్మిదో తరగతి సీట్లను మాత్రమే భర్తీ చేయనున్నట్లు ఆర్‌సీవో అలివేలు తెలిపారు. అలుగునూర్‌ పాఠశాలలో 80 సీట్లు బాలికలు, 80 సీట్లు బాలురకు, గౌలిదొడ్డిలో 80 సీట్లు బాలికలు ఉన్నట్లు వివరించారు. ఈ విద్యాలయాల్లో తొమ్మిదో తరగతి సిలబస్‌తోపాటు ఐఐటీ, నీట్‌ ఫౌండేషన్‌ కోర్సుల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు. 9వ తరగతిలో ప్రవేశానికి ప్రస్తుత విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు.

భీమ్‌గల్‌ బస్‌డిపోను అభివృద్ధి చేయండి

ఖలీల్‌వాడి: భీమ్‌గల్‌ బస్‌ డిపోలో పూర్తిస్థాయి అధికారులను నియమించి డిపో అభివృద్ధికి కృషి చేయాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. 1989లో అప్పటి కాంగ్రెస్‌ ప్రభుత్వం బస్‌డిపోను ఏర్పాటు చేసిందని తెలిపారు. గత ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించి డిపోను మూసివేయగా, ఎన్నికల్లో లబ్ధిపొందాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం నాలుగు నెలల క్రితం బస్‌ డిపోను పునః ప్రారంభించి ప్రజలను మభ్యపెట్టిందని, పూర్తిస్థాయిలో బస్సులను, సిబ్బందిని నియమించలేదన్నారు.

ప్రభుత్వం స్పందించి డిపోను అభివృద్ధి చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేశ్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్‌, బాల్కొండ యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు నాగేంద్ర, మహేశ్‌, నిఖిల్‌రెడ్డి తదితరులున్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సన్మానాలు..

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును రాష్ట్ర కో ఆపరేటివ్‌ యూనియన్‌ చైర్మన్‌, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం మాజీ మంత్రి, బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌ రెడ్డి, షబ్బీర్‌ అలీని సన్మానించారు. ఆయనవెంట జిల్లాకు చెందిన నాయకులు ఉన్నారు.

సరిహద్దుల్లో చెక్‌పోస్టులు



బోధన్‌టౌన్‌(బోధన్‌): పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దులోని సాలూర, పోతంగల్‌, ఖండ్గాం, కందకుర్తిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్‌ సీఐ పవన్‌గౌడ్‌ తెలిపారు. మంగళవారం సాలూర చెక్‌ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహారాష్ట్రకు బోధన్‌ డివిజన్‌ సమీపంలో ఉన్నందున డబ్బు, మద్యం అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. ప్రత్యేకంగా కంట్రోల్‌ రూమ్‌(87126 58975) ఏర్పాటు చేశామని, 24 గంటలు పనిచేస్తుందని తెలిపారు. సీఐ వెంట సిబ్బంది ఉన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐడీ ఎస్పీ లావణ్య, రిజిస్ట్రార్‌ యాదగిరి

- సీఐడీ ఎస్పీ లావణ్య
- వర్సిటీలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

తెయూ(డిచ్‌పల్లి): మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని సీఐడీ ఎస్పీ (హైదరాబాద్‌) డాక్టర్‌ లావణ్య అన్నారు. తెయూ ఉమెన్‌ సెల్‌ డైరెక్టర్‌ ఎం భ్రమరాంబిక అధ్యక్షతన మంగళవారం క్యాంపస్‌ కంప్యూటర్‌ సైన్స్‌ ఇంజినీరింగ్‌ కాలేజ్‌ సెమినార్‌ హాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు ఉన్నత చదువులు చదివి ఉద్యోగ, ఉపాధిలో స్థిరపడాలని సూచించారు. ప్రత్యేక అతిథిగా హాజరైన తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరి మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీ పడుతున్నారని అన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఆట, పోటీల్లో గెలుపొందిన బోధన, బోధనేతర మహిళా సిబ్బందికి, విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్‌ నసీం, ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ సీహెచ్‌ ఆరతి, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల రక్త నమూనాల సేకరణ

- డొంకేశ్వర్‌ మండలంలో పశువైద్యాధికారుల పర్యటన

సాక్షి ఎఫెక్ట్‌..

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): గొర్రెలు, పశువులకు ప్రబలుతున్న గాలికుంటు, షీప్‌పాక్స్‌, ఇతర సీజనల్‌ వ్యాధులపై రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని జిల్లా పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్‌ బాలిక్‌ అహ్మద్‌ అన్నారు. ఈ నెల 18న ‘సాక్షి’లో ప్రచురితమైన ‘పడకేసిన పశువైద్యం’ కథనంపై అధికారులు స్పందించారు. మంగళవారం డొంకేశ్వర్‌ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. నికాల్‌పూర్‌లో గొర్రెలు, మేకలను పరిశీలించి రక్త నమూనాలను సేకరించారు. మండల కేంద్రంలోని పశువైద్యశాలలో టీకాలను అందుబాటులో ఉన్నాయన్నారు. షీప్‌పాక్స్‌ వైరస్‌ సోకితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దత్తాపూర్‌ గ్రామంలో తెల్ల, నల్లజాతి పశువులను పరిశీలించి గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశు వైద్య, ల్యాబ్‌ అధికారులు అశోక్‌కుమార్‌, హన్మంత్‌రెడ్డి, సిబ్బంది సరళ, విజయ తదితరులున్నారు.



నికాల్‌పూర్‌లో గొర్రెలను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారులు

షాపూర్‌లో..

నందిపేట్‌ (ఆర్మూర్‌): మండలంలోని షాపూర్‌లో పశువులకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాలు వేశారు. జిల్లా సహాయ సంచాలకులు డాక్టర్‌ బాలిక్‌ అహ్మద్‌, వ్యాధి నిర్ధారణ సహాయ సంచాలకులు డాక్టర్‌ అశోక్‌ పాల్గొని పశుపోషకులకు పలు సూచనలు చేశారు. పశు వైద్య సిబ్బంది సరళ, రాణి, విజయ, స్వప్న, శ్యామల, సత్యం, విజయలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామస్తుల సహకారంతో దంపతుల అంత్యక్రియలు

- అమ్దాపూర్‌లో విషాదం

బోధన్‌రూరల్‌(బోధన్‌): ఆర్థిక ఇబ్బందుల కారణంగా జిల్లా కేంద్రంలో ఆత్మహత్య చేసుకున్న మండలంలోని అమ్దాపూర్‌కు చెందిన దంపతుల అంత్యక్రియలను మంగళవారం గ్రామస్తుల సహకారంతో నిర్వహించారు. ఊరిలో అప్పులు కావడం, రోజువారీ ఖర్చులకు సైతం ఇబ్బందులు ఎదురవడంతో బాబయ్య(65), పోచమ్మ(60)నాలుగైదు నెలలుగా నిజామాబాద్‌లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నారు. అప్పులు తీర్చే మార్గం లేకపోవడం, సొంతూరిని వదిలి వచ్చామనే మనస్తాపంతో ఇద్దరు తాడుకట్టుకుని నిజాంసాగర్‌కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. వృద్ధ దంపతుల మృతదేహాలను గ్రామానికి తీసుకువచ్చారు. బీఆర్‌ఎస్‌ మండల ప్రధానకార్యదర్శి సుదర్శన్‌ రూ.5వేలు, గ్రామస్తులు తమవంతు సహకారం అందించగా.. ఇద్దరు కొడుకులు అంత్యక్రియలను పూర్తి చేశారు.

క్రైం కార్నర్‌

బెల్ట్‌ షాపులపై కొరడా



మాక్లూర్‌/రెంజల్‌/మోపాల్‌/నవీపేట/ధర్పల్లి/బిచ్కుంద: బెల్ట్‌షాపులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. మంగళవారం దాడులు చేసి మద్యాన్ని సీజ్‌ చేశారు. మాక్లూర్‌ మండలం కొత్తపల్లి, గుత్ప గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు దాడి చేసి రూ.41,790 విలువైన మద్యాన్ని పట్టుకున్నారు. బెల్ట్‌షాప్‌ నిర్వాహకులను స్థానిక పోలీసులకు అప్పగించారు. సీపీ కల్మేశ్వర్‌ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ విష్ణుమూర్తి, సీఐ అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో టాస్క్‌ఫోర్స్‌ సిబ్బంది లక్ష్మణ్‌, సుదర్శన్‌, రాములు, అనిల్‌కుమార్‌ పాల్గొన్నారు. అలాగే రాంచంద్రాపల్లిలోని బెల్ట్‌షాప్‌పై ఎస్సై సుధీర్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. రెంజల్‌ మండలం కళ్యాపూర్‌లోని బెల్ట్‌షాప్‌పై సోమవారం రాత్రి హెడ్‌కానిస్టేబుల్‌ శ్రీనివాస్‌ సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. నిర్వాహకుడు కృష్ణపై కేసు నమోదు చేశామన్నారు. మోపాల్‌ మండలం సిర్‌పూర్‌తండా, పాతంగల్‌లో బెల్ట్‌షాపులపై దాడి చేసి మద్యం సీజ్‌ చేసినట్లు ఎస్సైలు గంగాధర్‌, యాదగిరిగౌడ్‌ తెలిపారు. ధర్పల్లి మండలం హొన్నాజీపేట్‌లో 135 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విక్రమ్‌ తెలిపారు. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం బండారెంజల్‌, పెద్దదేవాడ, సిర్‌సముందర్‌, భద్రాల్‌తండా, సిర్‌సముందర్‌ గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై ఎస్సై మోహన్‌రెడ్డి ఆకస్మిక దాడులు చేస్తున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

బాల్కొండ: మండలంలోని వన్నెల్‌(బి) శివారులో వరద కాలువ వంతెనపై మంగళవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముప్కాల్‌ మండల కేంద్రానికి చెందిన టిప్పర్‌ డ్రైవర్‌ ఉద్ధవ్‌(34) అక్కడిక్కడే మృతిచెందాడు. ఎస్సై గోపి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. డొంగ్రాగామ్‌కు చెందిన ఉద్ధవ్‌ గత కొంత కాలంగా ముప్కాల్‌ మండల కేంద్రంలో ఉంటున్నాడు. మంగళవారం వన్నెల్‌(బి)లో వెంకటేశ్వరుని జాతరలో పాల్గొని పడగల్‌కు వస్తుండగా, వన్నెల్‌ నుంచి పడగల్‌ వైపు వెళ్తున్న బైక్‌ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఉద్ధవ్‌ మృతి చెందగా, ఎదురుగా వచ్చిన బైక్‌పై ఉన్న రిషి తలకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లిపైదాడి చేసిన కొడుకు రిమాండ్‌

ఖలీల్‌వాడి: బంగారం, పింఛన్‌ డబ్బుల కోసం తల్లిపై దాడికి పాల్పడిన కొడుకును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని మూడో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని దుబ్బ ప్రాంతానికి చెందిన ముద్దం గంగామణికి ఇద్దరు కుమారులు శ్రీనివాస్‌, ప్రవీణ్‌ కాగా, నాలుగు నెలల క్రితం శ్రీనివాస్‌ మృతి చెందాడు. ఇద్దరు కుమారుల కుటుంబాలకు గంగామణి ఆస్తి పంపకం చేసింది. అయితే ఆమె వద్ద ఉన్న బంగారం, పింఛన్‌ డబ్బులు ఇవ్వాలని ప్రవీణ్‌ ఈనెల 17న దాడి చేశాడు. గంగామణి మనవడు మనోజ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రవీణ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

బాన్సువాడ రూరల్‌: భార్యను వేధిస్తున్న ఓ భర్తపై గృహహింస కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పాత బాన్సువాడకు చెందిన గౌంటి భూమయ్య(ఆర్మీ ఉద్యోగి) రోజాను 2017లో రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వివాహమైన నాటి నుంచి భూమయ్య రోజాను మానసికంగా వేధిస్తూ విచక్షణ రహితంగా కొట్టేవాడు. సోమవారం సైతం దాడి చేయడంతో రోజా పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు భూమయ్యపై గృహహింస కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

వణికిస్తున్న శునకాలు



హౌసింగ్‌బోర్డు రోడ్డుపై వీధికుక్కలు



చనిపోయిన కోళ్లు, పెంపుడు కుక్క

- ఆర్మూర్‌ పట్టణంలో స్వైరవిహారం

ఆర్మూర్‌టౌన్‌: శునకాలు గుంపులుగుంపులుగా తిరుగుతూ పట్టణ ప్రజలను వణికిస్తున్నాయి. ఏ రోడ్డుపై చూసినా గుంపులుగుంపులుగా తిరుగుతూ దాడులు చేస్తుండడంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డుల్లో ఎక్కడ చూసినా వీధి కుక్కలు సంచరిస్తున్నాయని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హౌసింగ్‌బోర్డు, టీచర్స్‌కాలనీ, కొత్తబస్టాండ్‌, జిరాయత్‌నగర్‌, గోల్‌బంగ్లా, పోచమ్మగల్లీ, మల్లారెడ్డి చెరువు, మామిడిపల్లి, పెర్కిట్‌ బస్టాండ్‌ తదితర ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. టీచర్స్‌ కాలనీకి చెందిన ఎస్‌ ప్రసాద్‌ ఇటీవల కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌ వెళ్లి వచ్చేసరికి ఇంటి ఆవరణలో ఉన్న 12కోళ్లతోపాటు పెంపుడు కుక్కపై వీధి కుక్కలు దాడి చేసి చంపేశాయి. ఈ విషయమై ప్రసాద్‌ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఆడుకునేందుకు పిల్లలను ఇంటి నుంచి బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని వీధి కుక్కలు వెంబడిస్తుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. పట్టణ పరిధిలో ప్రతిరోజూ ఐదు నుంచి పది మంది కుక్కకాటుకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

అటవీ ప్రాంతానికి తరలిస్తాం



పట్టణ పరిధిలో కుక్కల బెడద నివారణకు చర్యలు చేపడతాం. వీధికుక్కలను పట్టుకొని అటవీప్రాంతానికి తరలించే విధంగా చర్యలు తీసుకుంటాం. పట్టణ ప్రజలు ఆహారపదార్థాలను రోడ్లపై వేయొద్దు. కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించేందుకు జిల్లా కేంద్రానికి తరలిస్తాం.

– ఏ రాజు, మున్సిపల్‌ కమిషనర్‌, ఆర్మూర్‌

కుక్కల బెడదను నివారించాలి

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని 10వ వార్డు టీచర్స్‌ కాలనీలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, చర్యలు తీసుకోవాలని టీచర్స్‌ కాలనీవాసులు మున్సిపల్‌ ఇన్‌చార్జి చైర్మన్‌ షేక్‌ మున్నూ, మున్సిపల్‌ కమిషనర్‌ రాజును కోరారు. ఈ మేరకు వారికి ఫిర్యాదు చేశారు. టీచర్స్‌ కాలనీకి చెందిన ప్రసాద్‌ తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌ వెళ్లారు. సోమవారం అర్ధరాత్రి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో ఉన్న 12 కోళ్లు, ప్రసాద్‌ పెంచుకున్న కుక్క, ఊర కుక్కల దాడిలో చనిపోయి ఉన్నాయి. ఉదయం ఇంటి బయటకు వచ్చి పనులు చేసుకుంటున్న సమయంలో కుటుంబ సభ్యులపైకి ఊర కుక్కలు మళ్లీ దాడి చేసేందుకు రావడంతో గట్టిగా కేకలు వేశామని, దీంతో కుక్కలు పారిపోయాయని బాధితులు తెలిపారు. ఇప్పటికైనా పాలక వర్గం, అధికారులు కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.



ఇన్‌చార్జి చైర్మన్‌ షేక్‌ మున్నూకు వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ఎడపల్లి(బోధన్‌): మండలంలోని జాన్కంపేట్‌ నుంచి నవీపేట్‌ వెళ్తున్న మొరం టిప్పర్‌ బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. బైక్‌ను ఢీకొట్టిన తరువాత టిప్పర్‌ను ఆపకుండా వెళ్లిపోయేందుకు డ్రైవర్‌ ప్రయత్నించగా, తాము పట్టుకున్నట్లు తెలిపారు. రాత్రివేళ్లలో సైతం మొరం టిప్పర్లు వేగంగా వెళ్తున్నాయని, పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

బాన్సువాడ రూరల్‌: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని బుడిమి గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ కృష్ణ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బందారి హన్మాండ్లు ఈ నెల 18న రాత్రి పని నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లి బైక్‌పై వస్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన హన్మాండ్లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తల్లీకొడుకు అదృశ్యం

బోధన్‌రూరల్‌(బోధన్‌): మండలంలోని లంగ్డాపూర్‌ గ్రామానికి చెందిన ఓ వివాహిత(25) తన ఐదేళ్ల కొడుకుతోపాటు అదృశ్యమైనట్లు రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ తెలిపారు. గత సంవత్సరం నవంబర్‌లో ఇంటి నుంచి వెళ్లిపోయిన వివాహిత తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీకోసం వెతికి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఇందల్వాయి: ఆర్థిక ఇబ్బందుల కారణంగా సిర్నాపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రాంసాగర్‌ తండాకు చెందిన లాలు(43) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మనోజ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న లాలుకు భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లు చేసిన లాలు.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపానికి గురై మంగళవారం ఉదయం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సోనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఉప్పల్‌వాయిలో..

రామారెడ్డి: అనారోగ్యంతో బాధపడుతున్న ఉప్పల్‌వాయి గ్రామానికి చెందిన ఆకుల లింగం(46) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై విజయ్‌ కొండ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బ్రెయిన్‌స్ట్రోక్‌ రావడంతో లింగం నడవలేని స్థితిలో ఉన్నాడు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం ఉదయం పశువుల కొట్టంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు ఏఎస్సై రవీందర్‌ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కామారెడ్డిలో..

కామారెడ్డి క్రైం: అనారోగ్యం కారణంగా పట్టణంలోని హరిజనవాడకు చెందిన బానోత్‌ మహేశ్‌(40) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మాచారెడ్డి మండలం సరదాపూర్‌ తండాకు చెందిన బానోత్‌ నీలతో మహేశ్‌కు 20ఏళ్ల క్రితం వివాహమైంది. 15 ఏళ్లుగా హరిజనవాడకు చెందిన గీతతో సహజీవనం చేస్తూ ఆమెతోపాటు కామారెడ్డిలోనే ఉంటున్నాడు. మద్యం సేవించే అలవాటుఉన్న మహేశ్‌కు కాలేయానికి సంబంధించిన సమస్య రావడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి బానోత్‌ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.